క్లుప్తంగా

అధికారులపై దాడి కుట్ర కేటీఆర్‌దే..

జగిత్యాల: అధికారులపై దాడి కుట్ర బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌దేనని, ఆయనను లోపలేసి కొవ్వు తగ్గించాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. గురువారం జగిత్యాలలో విలేకరులతో మాట్లాడారు. కేటీఆర్ చెల్లెను జైలుకు పంపించినట్లే ఆయనను కూడా పంపించాలని పేర్కొన్నారు. కేటీఆర్‌ను నామరూపం లేకుండా చేస్తేనే రాష్ట్రం బాగుపడుతుందన్నారు. మాట్లాడే పద్ధతి, కలెక్టర్లపై దాడిపై విచారణ చేపట్టాలన్నారు.

క్యాంటీన్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని వినతి

జగిత్యాలజోన్: జిల్లా కోర్టులో క్యాంటీన్ నిర్మాణం కోసం రూ 10 లక్షలు కేటాయించాలని జగిత్యాల బార్ అసోసియేషన్ న్యాయవాదులు గురువారం ఎంపీ అర్వింద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అలాగే, న్యాయవాదులకు సంబంధించిన పలు సమస్యల గురించి చర్చించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డబ్బు లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి భూమి రమణ, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్ రావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

యావర్‌రోడ్‌కు నిధులు కేటాయించండి

జగిత్యాల: జిల్లా కేంద్రంలో ప్రధాన సమస్యగా ఉన్న కేంద్ర ప్రభుత్వం నుంచి యావర్‌రోడ్‌కు నిధులు కేటాయించాలని ఎంపీ అర్వింద్‌కు మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగిత్యాలలో ట్రాఫిక్ పెరిగిపోయిందని, అలాగే 1.50 లక్షల జనాభా ఉందని, రహదారులకు ఇబ్బందికరంగా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు కేటాయించి వెడల్పు చేసేలా చూడాలని కోరారు. అలాగే స్మార్ట్‌సిటీలో సిటీలో సెలెక్ట్ చేసి అండర్ డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా నేషనల్ హైవేపై ఉన్న యావర్‌రోడ్‌ను బ్లాక్‌స్పాట్‌గా గుర్తించడం జరిగిందని, దీనిని వెడల్పు చేస్తే అందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

ఆకతాయిల ఆగడాలపై చర్యలు తీసుకోవాలి

మల్లాపూర్: మోడల్ స్కూల్ వద్ద ఆకతాయిల ఆగడాలపై చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ భూమేశ్ అన్నారు. గురువారం మల్లాపూర్ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై కిరణ్‌కుమార్‌ను మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు కలిసి ఆకతాయిల వేధింపులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ స్కూల్ బస్టాఫ్ వద్ద కొందరు ఆకతాయిలు బైక్‌పై త్రిపుల్‌రైడింగ్ వెళ్తూ విద్యార్థినులను వేధ/స్తున్నారన్నారు. మోడల్ హాస్టల్ వరకు వచ్చి విద్యార్థినుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారన్నారు. వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎస్సై మోడల్ స్కూల్ వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తామని, సీసీ కెమెరాలు అమర్చి ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ధర్మపురి: కార్తీక పౌర్ణమి సందర్భంగా ధర్మపురి పట్టణంలో విధించిన ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని ధర్మపురి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాంనర్సింహారెడ్డి అన్నారు. నేటి కార్తీక పౌర్ణమి సందర్భంగా వివిధ జిల్లాల నుంచి గోదావరి స్నానాలు, దైవ దర్శనం కోసం వేలాది మంది భక్తులు రానున్నందున వారికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని పేర్కొన్నారు. ముఖ్యంగా దైవ దర్శనం కోసం వచ్చే వాహన దారులు స్థానిక నంది విగ్రహం నుంచి దేవాలయానికి వాహనాలను లోనికి వెళ్లకుండా ఏర్పాట్లు చేసామని భక్తులు గమనించాలని సూచించారు. భక్తులు తమ వాహనాల పార్కింగులను కూరగాయల మార్కెట్, హరిత హోటల్, బ్రాహ్మణ సంఘం వద్ద తమ తమ వాహనాలను నిలుపుకోవాలని పేర్కొన్నారు. దేవాలయానికి, బ్రహ్మపుష్కరిణి కోనేరుకు భక్తులు కాలి నడకన వెళ్లాలని సూచించారు.

ఉద్యోగులపై దాడి బాధాకరం

జగిత్యాల: వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, స్పెషల్ ఆఫీసర్ వెంకట్‌రెడ్డి, ఉద్యోగులపై దుద్యాల మండలం లగిచెర్లలో దాడిచేయడం బాధకరమని జేఏసీ చైర్మన్ జగదీశ్వర్ అన్నారు. గురువారం కలెక్టరేట్ ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయని, ప్రభుత్వం వెంటనే దోషులను శిక్షించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవో నాయకులు నాగేందర్‌రెడ్డి, వకీల్, అశోక్‌కుమార్, కందుకూరి పూర్ణచందర్ హన్మంతరావు, ఆనందరావు, రవిబాబు, శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

కోరుట్ల: కోరుట్ల ఆర్టీసీ డిపోలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ మనోహర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ప్రయాణికులు తమ సమస్యలను ఫోన్ నంబరు 837453961కు కాల్ చేయవచ్చని డీఎం పేర్కొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం



కోరుట్ల/కోరుట్ల రూరల్/రాయికల్/కథలాపూర్/పెగడపల్లి/ ఇబ్రహీంపట్నం/మల్లాపూర్/కొండగట్టు: బాలల దినోత్సవం సందర్భంగా రాయికల్ పట్టణంతో పాటు, కథలాపూర్, పెగడపల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాల్లో లోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయ అవతారమెత్తి పాఠాలు బోధించారు. అనంతరం నిర్వహించిన వేడుకల్లో చిన్నారులు ఇచ్చిన వివిధ ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి.



తాటిపల్లి గురుకుల పాఠశాలలో బాలికలు



కోరుట్ల: విద్యార్థులకు బహుమతులు ప్రదానం



పెగడపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు



సిరికొండలో ఉపాధ్యాయుల వేషధారణలో చిన్నారులు



జగిత్యాల: చిల్డ్రన్స్ డే వేడుకల్లో ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శన



జగిత్యాల: వేడుకల్లో నృత్యాలు చేస్తున్న చిన్నారులు

జీవనశైలి మార్పుతోనే మధుమేహం నియంత్రణ

ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: జీవనశైలి మార్పుతోనే మధుమేహం నియంత్రించుకోవచ్చని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం ప్రపంచ మధుమేహ దినోత్సవం పురస్కరించుకుని ఐఎంఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ కంటి డాక్టర్‌గా ఈ వ్యాధి పట్ల పూర్తి అవగాహన ఉందని, ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి లక్షణాలు తెలుసుకుని తొలి దశలోనే నియంత్రించుకోవాలన్నారు. గుండె, కిడ్నీలపై ప్రభావం చూపుతుందని, ఆహార వినియోగంలో చక్కరను తగ్గించుకోవాలన్నారు.అనంతరం ఐఎంఏ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరానికి 112 మందికి మధుమేహ చికిత్సలు నిర్వహించి దానికి సంబంధించిన అవగాహన పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు హేమంత్, కార్యదర్శి ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ డాక్టర్లు రాజేశ్వర్‌రావు, వాసాల శ్రీధర్, చక్రధర్ పాల్గొన్నారు.



బుక్స్ అందిస్తున్న ఎమ్మెల్యే, ఐఎంఏ వైద్యులు

జగిత్యాల: జిల్లా అదనపు కలెక్టర్‌గా లత ఇటీవల బాధ్యతలు స్వీకరించగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ గురువారం కలిసి అభినందనలు తెలిపారు.

ఎల్‌వోసీ అందజేత

రాయికల్: మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన చింతకుంట మమత నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. నిమ్స్‌లో చికిత్స కోసం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ స్పందించి రూ.1.50 లక్షల ఎల్‌వోసీని గురువారం మమత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి, లక్ష్మణ్, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం పాల్గొన్నారు.

సహకార సంఘాల అభివృద్ధికి కృషి

ధర్మపురి: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అభివృద్ధికి కృషి చేస్తామని ఉమ్మడి జిల్లా డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా ధర్మపురితో పాటు మండలంలోని జైనా సహకార సంఘాల్లో వారోత్సవాల సందర్భంగా జెండాలను ఎగురేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 20 వరకు వారోత్సవాలను నిర్వహించనున్నామని, సంఘం పరిసరాలను, పరిశుభ్రత, డిపాజిట్ల సేకరణ చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో జైనా పీఏసీఎస్ చైర్మన్ నరేశ్, ఉపాధ్యక్షుడు శేర్ల రాజేశం, డైరెక్టర్లు ఎల్లాగౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి

సహకార సంఘాలదే కీలకపాత్ర

కథలాపూర్: రైతులకు సేవలందించడంలో సహకార సంఘాలది కీలకపాత్ర అని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి అన్నారు. గురువారం కథలాపూర్ మండలం భూషణరావుపేటలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వారోత్సవాల వేడుకలు ప్రారంభించారు. సహకార జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఈవో ఉశకోల అరుణ్, నాయకులు పాల్గొన్నారు.

రాయికల్: పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో గురువారం 71వ అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఈవో ఎలిగేటి రవికుమార్, వైస్ చైర్మన్ బేతి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు చల్‌గల్ విద్యార్థులు

జగిత్యాలరూరల్: మండలంలోని చల్‌గల్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన దూడ రమ్య రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ వెంకటలక్ష్మి తెలిపారు. ఈనెల 16 నుంచి 18 వరకు మెదక్ జిల్లా చేగుంటలో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో రమ్య పాల్గొంటుందని, ఈ సందర్భంగా గురువారం హెచ్‌ఎం లతదేవి, పాఠశాల చైర్మన్ నీరటి సుకన్య, ఉపాధ్యాయులు అభినందించారు.

నేషనల్ లెవల్ మార్షల్ ఆర్ట్స్‌కు కృష్ణవేణి విద్యార్థుల ఎంపిక

రాయికల్: పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన రుత్విక్, కృష్ణ, రుద్వేద్‌రావు, శ్రీదత్త అనే విద్యార్థులు జమ్ముకాశ్మీర్‌లో ఈనెల 16,17,18 తేదీల్లో నిర్వహించే నేషనల్ లెవల్ మార్షల్ ఆర్ట్స్‌కు ఎంపికైనట్లు కరాటే మాస్టర్ ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా వీరిని ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రావు అభినందించారు.

క్రీడాకారులకు దుస్తులు అందజేత

కథలాపూర్: మండలంలోని ఇప్పపెల్లి గ్రామానికి చెందిన వాలీబాల్ క్రీడాకారులకు దుస్తులు ఎస్సై నవీన్‌కుమార్ చేతులమీదుగా గురువారం అందించారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు దాతలు ముందుకు రావాల్సిన అవసరం ఉందని ఎస్సై పేర్కొన్నారు. క్రీడాకారులు జాతీయస్థాయిలో ప్రతిభ చాటాలన్నారు. కార్యక్రమంలో దాత మండలోజి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ నాంపెల్లి లింబాద్రి, కనపర్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతులను వేధిస్తే చర్యలు

బుగ్గారం: మండలంలోని చిన్నాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మార్వో మజీద్, ఎస్సై శ్రీధర్ రెడ్డి గురువారం సందర్శించారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులను ఇబ్బంది పెడితే వ్యాపారులపై ఎసెన్షియల్ సర్వీసెస్ మెయింటెనెన్స్ (ఈఎస్‌ఎంఏ) యాక్ట్ ద్వారా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. అలాగే రైతులు పండించిన పంట ఉత్పత్తులు, కొనుగోళ్లలో మోసాలకు పాల్పడి రైతులను వేధిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై శ్రీధర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో నవీన్, పీఏసీఎస్ ఇన్‌చార్జి శ్రీనివాస్ పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో సహకారం అందించాలి

మల్లాపూర్: శాంతిభద్రతల పరిరక్షణలో రాత్రింబవళ్లు విధి నిర్వహణతో పనిచేసే పోలీసులకు ప్రజలు సహకారం అందించాలని మల్లాపూర్ ఎస్సై కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని వేంపల్లిలో పోలీసుల ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు కళాజాత ప్రదర్శనలతో చైతన్యం కల్పించేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అనంతరం కళాజాత బృందం పలు సామాజిక రుగ్మతలపై ఇచ్చిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బిట్ల సరోజన, గుగ్లావత్ భూమి, బిట్ల నరేశ్, నాయకులు, యువకులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాశీవిశ్వనాథుడి రథయాత్ర

సారంగాపూర్: ధర్మజాగరణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన కాశీ విశ్వనాథుడి రథయాత్ర గురువారం బీర్‌పూర్, సారంగాపూర్ మండలాల్లోని ప్రధాన వీధుల్లో కొనసాగింది. హిందూ మత ప్రచారంలో భాగంగా చేపట్టిన ఈ రథయాత్రకు రెండు మండలాల్లోని మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. రథంపై ఉన్న శివ, పార్వతులకు గ్రామాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. రథం వెంట హిందూ ధర్మజాగరణ సమితి ప్రచారకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన డీఎస్పీ

మల్యాల: మండలంలోని బల్వంతాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం డీఎస్పీ రఘుచందర్, సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్‌కుమార్, తహసీల్దార్ మునీందర్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో తిరిగి ధాన్యం కుప్పలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. నిత్యం ఎన్ని క్వింటాళ్ల ధాన్యం తూకం వేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ధాన్యం తరలింపులో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. తేమ శాతం వచ్చిన ధాన్యం వెంటనే తూకం వేసి తరలించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ తిరుపతి, రైతులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రంలో డీఎస్పీ, తహసీల్దార్

మోటార్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలి

మల్యాల: రైతులు వ్యవసాయ బావులకు ఐఎస్ఐ మోటార్లను వినియోగించాలని, మోటార్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలని విద్యుత్ ఏడీఈ మహేందర్ అన్నారు. మండలంలోని తక్కళ్లపల్లిలోని రైతులు వ్యవసాయ బావుల మోటార్లను ఎన్పీడీసీఎల్ కార్యక్రమం పొలం బాటలో భాగంగా గురువారం పరిశీలించారు. కెపాసిటర్లు బిగించుకోవడంతో లోవోల్టేజీ సమస్య అధిగమించవచ్చని, విద్యుత్ ఆదా అవుతుందని ఏడీఈ అన్నారు. రైతులకు విద్యుత్ సంబంధిత సమస్యలుంటే టోల్ ఫ్రీ నంబర్ 1912లో సంప్రదించాలని, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఏడీఈ మహేందర్ సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ దయానంద్, రైతులు పాల్గొన్నారు.



తక్కళ్లపల్లిలో రైతులతో విద్యుత్ అధికారులు

బీజేపీని బలోపేతం చేయాలి

మల్లాపూర్: బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, మండల ఇన్‌చార్జి వడ్డెపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం మల్లాపూర్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సంస్థాగత ఎన్నికల వర్క్‌షాప్‌కు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతి ఎన్నికకు బీజేపీ బలం పెరుగుతుందని, ప్రస్తుతం కాంగ్రెకు ప్రత్యామ్నాయంగా బీజేపీ ఎదిగిందన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో అధికారం చేపట్టేది బీజేపీ పార్టీయేనని, అందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాల్సి ఉందన్నారు. బూత్ అధ్యక్షులు తన కార్యవర్గాన్ని ఏర్పచుకుని క్రియాశీల సభ్యత్వాలను నమోదు చేయించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి ఎర్ర లక్ష్మీ, బీజేవైఎం మండల అధ్యక్షుడు పందిరి నాగరాజు, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు గుయ్యా మల్లేష్‌యాదవ్, లవంగ శివకుమార్, ఓబీసీ మండల అధ్యక్షుడు గజ్జి శీను, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు రాజేందర్, బీజేపీ, వివిధ మోర్చాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.



ఎన్నికల వర్క్‌షాప్‌లో పాల్గొన్న రాష్ట్ర నాయకులు

సంక్షిప్త వార్తలు

ప్రణాళికాబద్ధంగా చదవాలి

జగిత్యాల: నిరుద్యోగ యువత ప్రణాళికబద్దంగా చదవాలని, అప్పుడే పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చని సీఐ వేణుగోపాల్ అన్నారు. గురువారం గ్రంథాలయ వారోత్సవాలలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతీ ఒక్క నిరుద్యోగి ఒక గోల్ ఏర్పాటు చేసుకుని దాని దిశగా వెళ్లాలని, గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ అంతా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ ఇన్‌చార్జి సరిత, పీఆర్టీయూ అధ్యక్షుడు ఆనందరావు, పాలకురాలు శకుంతల, కవిత, జమున పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

సారంగాపూర్: మండలంలో 14వ విడత జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ బృందాలు ఏడాదికాలంగా సారంగాపూర్ మండలంలో చేపట్టిన పనులపై క్షేత్రస్థాయిలో పర్యటించి, పనులను పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు . ఈ సందర్భంగా పనుల వద్ద లబ్దిదారులను, చేపట్టిన పనుల్లో ప్రగతిలో ఉన్నాయన్న దానిపై వివరాలు సేకరించారు. కూలీల వద్దకు వెళ్లి కూలి డబ్బులు అందాయా లేదా అన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో శ్రీలత, టెక్నికల్ అసిస్టెంట్ శివ, కంప్యూటర్ ఆపరేటర్ కోటేశ్వర్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ గంగాధర్, సామాజిక తనిఖీ బృందాలు ఉన్నాయి.

మహాసభలను విజయవంతం చేయాలి

జగిత్యాల: డిసెంబర్ 8న జరిగే మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు శ్రీకాంత్ అన్నారు. గురువారం జగిత్యాలలో మాట్లాడారు. డిసెంబర్ 8న కోరుట్ల పట్టణంలో నిర్వహించనున్న మూడో మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. నిరుపేదలకు ఇళ్లు, ఇళ్లస్థలాలు మంజూరు చేయాలన్నారు. బీజేపీ ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలు గత ప్రభుత్వాలకంటే వేగంగా అమలు చేస్తూ కులమతాల మధ్య చిచ్చు పెడుతుందన్నారు. కార్యక్రమంలో సిరికొండ చంద్రయ్య, సురేశ్, వెంకటచారి, శేఖర్ పాల్గొన్నారు.

30 వరకు ఉచిత వైద్య శిబిరాలు

మెట్‌పల్లి: షుగర్ వ్యాధి నిర్ధారణ ఉచిత వైద్య శిబిరాలు ఈ నెల 30 వరకు నిర్వహిస్తామని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఇల్లెందుల శ్రీనివాస్ తెలిపారు. ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం 2కే వాక్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కొత్త బస్టాండ్ వద్ద డాక్టర్ దిలీప్‌రావు దీనిని జెండా ఊపి ప్రారంభించారు. ఈ నెల 1 నుంచి ప్రారంభించిన వైద్య శిబిరాలను నెలాఖరు వరకు కొనసాగిస్తామని,తెలిపారు. కార్యక్రమంలో గుండా రాకేశ్, నాంపల్లి వేణుగోపాల్, గడ్డం శంకర్ పాల్గొన్నారు.

ఆహారపు అలవాట్లను నియంత్రించుకోవాలి

రాయికల్: ఆహారపు అలవాట్లను నియంత్రణతోనే మధుమేహాన్ని నియంత్రించవచ్చని మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. గురువారం ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా రాయికల్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రణుతి జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మచ్చ శేఖర్, డీసీలు, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

జగిత్యాల: దివ్యాంగ విద్యార్థుల ప్రీమెట్రిక్ ఉపకార వేతనాల కోసం డిసెంబర్ 31లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి నరేశ్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 1-10వ తరగతి చదువుతున్న దివ్యాంగ విద్యార్థుల ప్రీమెట్రిక్ ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు సమర్పించాలని, వారితో పాటు ఆధార్‌కార్డు, ఫోటోతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మిగతా వివరాలకు 8886845688 సంప్రదించాలన్నారు.

పిల్లల హక్కులను కాపాడాలి

జగిత్యాల: ప్రస్తుత సమాజంలో పెద్దలలాగే పిలలకు హక్కులున్నాయని, వాటిని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా లీగల్‌సెల్ అథారిటీ సెక్రటరీ జి.ప్రసాద్ అన్నారు. బాలల వారోత్సవాలను పురస్కరించుకుని బాలసదన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పిల్లలు అనేక రకాలైన సమస్యలకు గురవుతున్నారని, ఈ సమస్యలను రూపుమాపడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, వారికి బంగారు భవిష్యత్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంక్షేమాధికారి నరేశ్ మాట్లాడుతూ, బాలసదన్ సూపరింటెండెంట్ మమత, జిల్లా పరిరక్షణాధికారి హరీశ్, పీవో కరుణశ్రీ పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలి

జగిత్యాల: గ్రంథాలయాలు దేవాలయాలు లాంటివని, వాటిని వినియోగించుకోవాలని ఎస్‌కేఎన్‌ఆర్ ప్రిన్సిపాల్ అశోక్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం కళాశాలలో మాట్లాడారు. ప్రతి విద్యార్థి ప్రతిరోజు గ్రంథాలయాలకు వెళ్లాలని సూచించారు. పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్క విషయాన్ని తెలుసుకునేలా ప్రయత్నం చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సురేశ్, మధుకర్ పాల్గొన్నారు.

గుర్తింపు కార్డు చూపిస్తేనే సమాచారం చెప్పాలి

ధర్మపురి: కుటుంబ సమగ్ర సర్వే కోసం వచ్చే మా సిబ్బంది మున్సిపల్ శాఖ వారు ప్రవేశపెట్టిన గుర్తింపుకార్డును చూపిస్తేనే నిర్భయంగా తమ వ్యక్తి గత సమాచారాన్ని తెలుపవచ్చని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఎన్యూమరేటర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సర్వేలో చేపట్టాల్సిన వివిధ అంశాలను వివరించారు. అనంతరం కుటుంబ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, ఎన్యూమరేటర్లు తదితరులున్నారు.

దాడిచేసిన వారిపై కేసు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్‌లోని మహాత్మజ్యోతిరావు పూలే పాఠశాలలో ప్రిన్సిపల్ మమతపై దాడిచేసిన ఆమె భర్త గంగిపల్లి సంపత్, ఆమె సోదరుడు ఎడెల్లి రాజశేఖర్‌పై బుధవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు. మమతను కొద్దికాలంగా ఆమె భర్త సంపత్ అదనంగా రూ.5 లక్షలు కావాలంటూ.. అనుమానిస్తూ నిత్యం వేధింపులకు గురిచేస్తున్నాడు. బుధవారం పాఠశాల ఆవరణలోనే తనపై దాడిచేశారని ఫిర్యాదు మేరకు సంపత్, రాజశేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సదాకర్ తెలిపారు.

ఉన్నతాధికారుల విచారణ

పాఠశాలలో జరిగిన దాడి ఘటనపై కరీంనగర్ ఆర్సీవో అంజలి గురువారం విచారణ చేపట్టారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులతో మాట్లాడి వివరాలు సేకరించారు. వ్యక్తిగత కారణాలతోనే పాఠశాల ఆవరణలో గొడవ జరిగినట్లు తెలిసిందని, నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తానని ఆమె తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఒకరికి గాయాలు

మల్యాల: మేజర్ గ్రామ పంచాయతీ శివారులోని మొండికుంట ఒర్రె వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లి, యువకుడు గాయపడ్డాడు. జగిత్యాల పట్టణానికి చెందిన చెందిన యువకుడు పి.మధు గురువారం సాయంత్రం తాటిపల్లి నుంచి జగిత్యాలకు వెళ్తుండగా మల్యాల శివారులో బైక్ అదుపు తప్పి, చెట్ల పొదల్లోకి దూసుకెళ్లడంతో మధు గాయపడ్డాడు. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది బాధితుడిని జగిత్యాల ఆస్పత్రికి తరలించారు.

మోడల్‌స్కూల్‌లో కార్తీక దీపోత్సవం

కథలాపూర్: మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో గురువారం కార్తీక దీపోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు ప్రత్యేకంగా దీపాలు వెలిగించి పూజలు చేశారు. కార్తీక మాస దీపోత్సవం ప్రత్యేకత గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మోడల్‌స్కూల్‌లో దీపాలు వెలిగిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు